RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 49 | పేజీలు : 4 | గురువారం 20 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- ప్రణాళికను పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం
- మూడు భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు అభ్యంతరం
- ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం

# పట్టణ కోటపై ఎవరి జెండా?


ఆంధ్రప్రదేశ్‌లో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు

2021లో వైసీపీ ఆధిపత్యం చూపగా, 2024లో కూటమి అధికారంలోకి వచ్చింది.

ఇప్పుడు పట్టణ ఓటరు ఎవరికి మద్దతు ఇస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

బీసీ రిజర్వేషన్లు, స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలం, కూటమి ఓట్ల బదిలీ, వైసీపీ క్యాడర్ ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.

## ఏపీలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు!




**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే 87 మున్సిపాలిటీలు, ఇతర పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు పూర్తయింది. నవంబర్‌లో మరో 13 పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా, వార్డుల విభజన, రిజర్వేషన్లు, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు గతంలో కోర్టు కేసుల కారణంగా 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈసారి వాటితో పాటు మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు నిర్వహించేలా ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడకపోయినా.. ఏపీలో పట్టణ రాజకీయ యుద్ధానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ ఎన్నికలు ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారాయి. గత మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2021లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ భారీ విజయాన్ని నమోదు చేసింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. 725 కార్పొరేషన్ వార్డులకు జరిగిన ఎన్నికల్లో వైసీపీ 619 స్థానాలు, టీడీపీ 79, జనసేన 7, బీజేపీ ఒక స్థానం గెలుచుకున్నాయి.

విశాఖపట్నంలో వైసీపీ 59, టీడీపీ 29 వార్డులు గెలుచుకోగా.. విజయవాడలో వైసీపీ 49, టీడీపీ 14, గుంటూరులో వైసీపీ 43, టీడీపీ 10 స్థానాలను దక్కించుకున్నాయి. అంటే అప్పట్లో పట్టణ ఓటరు వైసీపీకి ఎంత బలమైన మద్దతు ఇచ్చాడో ఈ ఫలితాలు చెబుతున్నాయి.

ఇప్పటి పరిస్థితి

2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల ఎన్నికలుగానే కాకుండా.. - మిగతా3లో

## ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతపై

# బిగ్ అప్‌డేట్

- కొత్తగా వారికి కూడా మంజూరు
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసే వారికి బిగ్ అప్‌డేట్.
- త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు
- సెప్టెంబర్ 15 నాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం 2.5 లక్షల ఇళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.
- అంటే గతంలో కంటే ఈసారి మరింత త్వరగా ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వనుంది.

**హైదరాబాద్**

ఇటీవలే హైదరాబాద్ పరిధిలోని నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించిన ప్రభుత్వం, లబ్ధిదారులకు మరో గుడ్‌న్యూస్ చెప్పింది. వచ్చే నెల 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, వారికి ఇళ్ల మంజూరు పత్రాలను అందించాలని హౌసింగ్ కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. అంతేకాదు, వచ్చే ఏడాది మార్చి నాటికి 2.5 లక్షల ఇళ్ల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. హైదరాబాద్ పరిధిలోని 16 నియోజకవర్గాలు మినహా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగతా 100 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 2,500 ఇళ్లను నిర్మించనుంది. లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో రాష్ట్రంలో సుమారు 50 వేల మంది సొంత ఇళ్లు లేక గుడిసెల్లో నివసిస్తున్నట్లు తేలింది. దీంతో రెండో విడతలో వీరికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని హౌసింగ్ బోర్డు నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా బండల ఇళ్లు, రేకుల ఇళ్లలో నివసించే వారికి పైకప్పు (స్లాబ్) నిర్మించి ఇచ్చేందుకు 'రూఫ్ పునఃప్రారంభం' అనే మరో కొత్త పథకాన్ని కూడా తీసుకొచ్చింది.

ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 70 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టనుంది. వీటికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ పూర్తైన - మిగతా3లో



## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు



- మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదంటూ ఎద్దేవా
- గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ వేయకపోవడానికి ఇదే కారణమన్న లోకేశ్
- అసెంబ్లీ చర్చ నుంచి జగన్ పారిపోతున్నారని ఆరోపణ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లోకేశ్ పోస్ట్

# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు
- ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య




**హైదారాబాద్**

తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర - మిగతా3లో

గురువారం 20 ఆగస్టు 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# సర్ నోటీసుల జనరేట్ 100% పూర్తయింది..!!

.....ఎస్ఐఆర్ లో ప్రత్యేక కార్యాచరణతో విచారణలు వేగవంతం చేస్తాం.
.....వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్.





**అనంతపురం, ఆగస్టు 20 : సీమ వార్త సాయంత్రం.**

-అమరావతి, వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) - 2026పై జిల్లా కలెక్టర్లు ఁ జిల్లా ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ సమీక్షనిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా.. నోటీసుల జనరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. నోటీసుల డెలివరీలో ప్రస్తుతం 23 శాతం పెండింగ్ ఉందని, త్వరలోనే డెలివరీ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఇప్పటివరకు 26 శాతం విచారణలు పూర్తయ్యాయని, మిగిలిన 74 శాతం పెండింగ్ విచారణల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఫారం-6 మరియు ఫారం-8కి సంబంధించి 10,000 కంటే ఎక్కువ దరఖాస్తులు ఉన్నాయని, వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుక్ ఎ కాల్ సంబంధించి 38 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కారం చేస్తామన్నారు. ఎన్ జి ఎస్ పి లో 8 కంప్లైంట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు.

## బడుగుల ప్రయాణానికి...

# చంద్రుని వెలుగు..!!

నాడు వైసిపి కోత విధిస్తే... నేటి కూటమి ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచింది.

రాజకీయ ఎదుగుదలతోనే బీసీలు శాసించే స్థాయికి ఎదుగుతారు.

గోరంట్ల టిడిపి కార్యాలయం లో..... మోడీ,చంద్రబాబు పవన్,సవిత చిత్రపటాలకు బీసి ల పాలాభిషేకం.









**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.**

రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని దాదాపు 34 శాతం రిజర్వేషన్లు పెంచి దీజ ల అభ్యున్నతికి పాటుపడిందని అందుకు కృతజ్ఞతలు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప





ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి సవితమ్మ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు బీసీ వర్గాలు.గోరంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం కూటమి ప్రభుత్వ నేతలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తీర్చుకున్నారు బీసీ సామాజిక - మిగతా3లో



# రెడ్ క్రాస్‌కు... సమాజం రుణపడి ఉంటుంది...!!

**....రెడ్ క్రాస్ సొసైటీ ఔదార్యం.**

**తలసీమియా రోగుల రవాణా, రక్తదాన శిబిరాల నిర్వహణకు రూ.20 లక్షల విలువైన వాహనం అందజేత.**

**అనంతపురం: ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.**





ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధిగ్రస్తుల రవాణా సౌకర్యంతో పాటు రక్తదాన శిబిరాల నిర్వహణకు ఉపయోగపడే రూ.20 లక్షల విలువైన టెంపో ప్రయాణ వాహనాన్ని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ బహూకరించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ వాహనాన్ని సేవా కార్యక్రమాలకు అంకితం చేశారు. ఈ వాహనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఏ. మలోలా, జేఎన్టీయూ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, వాహన దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గజ్జల లక్ష్మణ ప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ గీతా బాల, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీ బిసాతి భరత్, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు,ఉప కమిటీ సభ్యులు, వాలంటీర్లు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాహన దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ మాట్లాడుతూ, డాక్టర్ గీతా బాల ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖలో తలసీమియా డే కేర్ సెంటర్ ప్రారంభించబడిందని, తలసీమియా వ్యాధిగ్రస్తుల అవసరాల కోసం ఒక వాహనం అవసరమని తనకు తెలియజేయడంతో వెంటనే స్పందించి వాహనానికి అవసరమైన నిధులను సమకూర్చినట్లు తెలిపారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసిన అనంతరం తనకు ఎంతో సంతోషం కలిగిందని, తాను అందించిన విరాళం సక్రమంగా ప్రజాసేవకు వినియోగించబడుతోందనే పూర్తి విశ్వాసం కలిగిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రెడ్ క్రాస్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎవరు చెప్పిన వినకండి..!!

## ---- జనరిక్ మందులు వాడండి.. వైద్య ఖర్చులు తగ్గించుకోండి

## మందుల దుకాణాల లాభాలు అనంతం

**( అనంతపురం డెస్క్ --- సీమవార్త):**







కేంద్రప్రభుత్వం అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉంచేందుకు అనేక చర్యలు తీసుకుంది. కార్పోరేట్ వైద్యం ఉచితంగా అందచేసేందుకు ఎయిమ్స్ ఆసుపత్రులను అక్కడక్కడ ఏర్పాటు చేసింది.ఈ ఆసుపత్రులలో అత్యంత ఖరీదైన వైద్యం ఉచితంగా అందచేస్తారు. వైద్య పరీక్షలు మందులు అన్ని కూడా ఉచితమే. ఇలాంటి ఆసుపత్రి మనకు మంగళగిరిలో అందుబాటులో ఉంది. ఇక్కడ 60 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేక వసతులు కూడా ఏర్పాటు చేశారు. రూ.5 లక్షల వరకు అందరికీ ఉచిత వైద్యం అందుబాటులో ఉంది.ఇదిలా ఉండగా వరుసగా జీవితకాలం మందివాడే రోగాలతో ఎక్కువ మంది బాధపడుతున్నారు.ఇలాంటి వ్యాధులలో ప్రధానంగా మధుమేహం,క్షయ, రక్తపోటు( బి.పి),.ఉన్నాయి.ఈ వ్యాధులతో బాధపడే వారు క్రమం తప్పకుండా మందులు వాడక తప్పడం లేదు. అయితే ఖరీదు గా ఉన్న మందులు మొత్తం నెలకు కావాల్సినవి కొనాలంటే రూ.2,3 వేల రూపాయలు ఖర్చు అవుతుంది.ముఖ్యంగా నిరాదరణకు గురైన వృద్ధులే ఇలాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి వైద్యం అందక, మందులు కొనలేక ఇబ్బందులు పడుతుంటారు. కాగా ఇలాంటి వారు జనరిక్ మందుల దుకాణంలో అవసరమైన మందులు తీసుకుంటే నెలకు రూ.5, 600 మించి ఖర్చు అవుతుంది. నెలకు రూ.4 వేలు పింఛన్ వచ్చే వారికి ఈ మేరకు ఖర్చు మందుల కోసం వచ్చినా మిగిలిన డబ్బులతో హాయిగా జీవనం చేసే అవకాశాలు ఉన్నాయి.అయితే జనరిక్ మందుల దుకాణాల్లో తీసుకునే మందులు తీసుకున్నా అవి పని చేస్తాయని డాక్టర్లు భరోసా ఇవ్వడం లేదు. మిగిలిన మందులు దుకాణం వారు జనరిక్ మందులు పని చేయవు అని బాహాటంగా ప్రచారం చేస్తున్నారు.కాగా వాస్తవాలను విశ్లేషణ చేస్తే జనరిక్ మందుల పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఏదైనా కొత్తగా మందును తయారు చేయాలంటే శాస్త్రవేత్తల సహాయ సహకారాలు అవసరం ఉంటుంది. పరిశోధన సమయాలలో శాస్త్రవేత్తలు, పరిశోధనకు అవసరమైన మూల పదార్థాల ఖర్చులు మొత్తం మందుల కంపెనీ వారు భరించాల్సి ఉంటుంది.ఈ విధంగా తయారైన మందులకు పన్నులు చెల్లించి కొంత లాభాలను నిర్ణయించి కొత్తగా తయారైన మందులను అమ్ముతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసినందున 20 ఏళ్ల పాటు సదరు మందుపై కంపెనీకి పూర్తిగా హక్కులు ఉంటాయి. మందు ఫార్ములా తెలిసినా మరొకరు ఆ మందును తయారు చేసేందుకు చట్టం ఆంగీకరించదు. అయితే 20 సంవత్సరాలు పూర్తి అయ్యాక ఆ మందుల తయారు పై సదరు కం పెనీ కి వ్యయం తగ్గుతుంది. దీనితో అదే మందులు యధాతథంగా అతి తక్కువ ధర కు అమ్ముతారు. సహజంగా రూ.100 రేటు గల మాత్రలు జనరిక్ లో రూ.20,30 కి అమ్ముతారు. ఈ విషయాన్ని తెలుసుకోకుండా జనరిక్ మందుల దుకాణం లో మందులు పనిచేయవు అనే అపోహత్జో ప్రజలు ఉన్నారు..వీరి అపోహకు కమీషన్ లకు కక్కుర్తి పడే డాక్టర్లు, మందుల దుకాణాల వారు ఆజ్యం పోస్తూ ఉన్నారు. పేదలు సంపాదించిన సొమ్ములో సగానికి పైగా సొమ్మును మందులకు ఖర్చు చేస్తున్నారు.కాగా ప్రభుత్వం జనరిక్ మందుల అవసరం, దాని ఉపయోగాలపై విస్తృత ప్రచార బాధ్యత ను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీమ వార్త సాయంకాలం

గురువారం
20 ఆగస్టు 2026

# పల్లె పల్లెలో ఎయిడ్స్ పై అవగాహన ఉండాలి.

## కొండాపురం ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమాలు.

**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.**
మండలంలోని కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ క్యాంపెయిన్, హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ అవగాహన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ అనంతపురం జిల్లా ,దిశా లెడ్ లింక్ వర్కర్ స్కీమ్ వారు ఐఇసి క్యాంపెయిన్ మరియు యాక్టివిటీస్ కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ సుప్రీత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూడా హెచ్.ఐ.వి. పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రతి గర్భిణి స్త్రీ కూడా హెచ్.ఐ.వి. పరీక్ష చేయించుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. డి ఆర్ పి రమేష్ యాదవ్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న




చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు గురించి వివారించారు. జోనల్ సూపర్ వైజర్ వెంకట్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఏ ఆర్ టి మందులు ,టోల్ ఫ్రీ నెంబర్ 1097 , క్యూఆర్ కోడ్ గూర్చి తెలిపారు. అలాగే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి కొంత మంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండాపురం పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ సుప్రీత, పీహెచ్ఎన్ రమాదేవి డి ఆర్ పి రమేష్ యాదవ్, జోనల్ సూపర్ వైజర్ వెంకట్, లింక్ వర్కర్ రాజశేఖర్, పీహెచ్సీ స్టాఫ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే గంగంపల్లి తాండా లో సీబీస్ ప్రోగ్రాం ద్వారా కొంతమంది కి హెచ్ఐవి రక్త పరీక్షలు చేయించడం జరిగింది.

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (చీజ్రా 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.
ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:
ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## పట్టణ కోటపై ఎవరి జెండా?

-మొదటిపేజీ తరువాయి
2024లో కూటమికి వచ్చిన విజయాన్ని పట్టణ ఓటరు మరోసారి ధృవీకరిస్తాడా? లేదా అనే చర్చ సాగుతోంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే కూటమికి అధికార బలం, ఎమ్మెల్యేలు--మంత్రుల నెట్‌వర్క్, 2024 ఎన్నికల ప్రభావం, టీడీపీ--జనసేన--బీజేపీ కలయిక కలిసొచ్చే అంశాలు. అయితే మున్సిపల్ ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికలతో పోల్చడం సరికాదు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి అంశాలు ప్రధానంగా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సమస్యలు, అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, వార్డు సమీకరణాలు చాలా కీలకంగా మారతాయి.

**ఏమడుగుతారు..**
పట్టణ ఓటరు ఈసారి తన ఇంటి ముందు రోడ్డు ఎలా ఉంది? డ్రైనేజీ సమస్య పరిష్కారమైందా? తాగునీరు వస్తుందా? చెత్త సక్రమంగా తొలగిస్తున్నారా? వీధి దీపాలు వెలుగుతున్నాయా? తన కౌన్సిలర్ ప్రజలకు అందుబాటులో ఉన్నారా? అనే అంశాలను ముందుగా చూసే అవకాశం ఉంది. అందుకే రాష్ట్రంలో ఎవరి ప్రభుత్వం అనే కంటే మా వార్డులో ఎవరు పనిచేస్తారనే ప్రశ్న స్థానిక ఎన్నికల్లో కీలకంగా మారవచ్చు.

**సీట్ల పరీక్ష..**
కూటమికి మరో ముఖ్యమైన పరీక్ష సీట్ల సర్దుబాటు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే ఓట్ల బదిలీ కూటమికి భారీ ప్రయోజనం కలిగించవచ్చు. కానీ ఒకే వార్డులో టికెట్ కోసం మూడు పార్టీల నాయకులు పోటీ పడితే అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. టికెట్ రాని నాయకులు రెబల్స్‌గా బరిలోకి దిగితే కూటమి ఓట్లు చీలే ప్రమాదం ఉంటుంది. అందుకే కూటమి వ్యూహంలో అభ్యర్థుల ఎంపిక అత్యంత కీలకం కానుంది. ప్రతి వార్డులో ఎవరు బలమైన నాయకుడు? ఎవరికీ వ్యక్తిగత ఓటు బ్యాంకు ఉంది? ఎవరు ప్రజలకు అందుబాటులో ఉంటారు? ఎవరి సామాజిక సమీకరణాలు అనుకూలంగా ఉన్నాయి? అన్న అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**తెలుగుదేశం..**
టీడీపీ ప్రధానంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రచార అస్త్రంగా మార్చుకునే అవకాశం ఉంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ మౌలిక సదుపాయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లవచ్చు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు కూడా పరోక్షంగా ఈ ఎన్నికల్లో పరీక్షకు గురయ్యే అవకాశం ఉంది.
పవన్ కల్యాణ్ పార్టీకి కూడా ఈ ఎన్నికలు కీలకమే. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి పవన్ కల్యాణ్ నాయకత్వం, జనసేన బలం ముఖ్యమైన పాత్ర పోషించాయి. ఇప్పుడు ఆ ప్రభావాన్ని వార్డు స్థాయిలో ఓట్లుగా మార్చుకోవడం జనసేనకు పరీక్ష. ముఖ్యంగా యువత, పట్టణ ఓటర్లలో పార్టీకి ఉన్న మద్దతును స్థానిక అభ్యర్థుల విజయంగా మార్చుకోవాల్సి ఉంటుంది.

**కమలం మదిలో...**
బీజేపీకి కూడా పట్టణ ఎన్నికలు మరో సవాల్ విసరనున్నాయి. పట్టణ మధ్యతరగతి, వ్యాపార వర్గాలు, యువతలో ఉన్న మద్దతును కూటమి అభ్యర్థులకు మళ్లించడం ద్వారా తన పాత్రను పెంచుకోవచ్చు.

**జగన్ పార్టీకి...**
వైసీపీకి ఈ ఎన్నికలు పునరాగమనానికి తొలి పరీక్ష కానున్నాయి. 2021లో పట్టణాల్లో భారీ విజయాన్ని సాధించిన పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంది. గతంలో గెలిచిన వార్డుల్లో తన పాత క్యాడర్‌ను తిరిగి యాక్టివ్ చేయడం, బలమైన స్థానిక నాయకులను ముందుకు తీసుకురావడం, కూటమి ప్రభుత్వంపై స్థానిక సమస్యల ఆధారంగా వ్యతిరేకతను పెంచడం వైసీపీ వ్యూహంగా ఉండొచ్చు.

**కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌కు మున్సిపల్ పోరు కీలకమే..**
ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ కూడా తమ ఉనికిని చాటుకునేందుకు సిద్ధమవుతున్నాయి. వైసీపీ--కూటమి ప్రధాన పోటీగా మారినా.. కొన్ని పట్టణాల్లో వామపక్షాలు బలమైన అభ్యర్థులను బరిలోకి దించే అవకాశం ఉంది. స్థానిక సమస్యలు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి అంశాలను ప్రచార అస్త్రాలుగా మలచుకోవాలని చూస్తున్నాయి.వామపక్షాలకు కొన్ని ప్రాంతాల్లో ఉన్న స్థానిక క్యాడర్ కీలకంగా మారనుంది.

**హస్తం గుర్తుపార్టీ..**
కాంగ్రెస్ కూడా పాత ఓటు బ్యాంకును తిరిగి కూడగట్టుకునేందుకు మున్సిపల్ ఎన్నికలను అవకాశంగా భావిస్తోంది. పట్టణాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును తమవైపు తిప్పుకోవడంపై ఆ పార్టీ దృష్టి పెట్టనుంది.

## బడుగుల ప్రయాణానికి... చంద్రుని వెలుగు..!!





-మొదటిపేజీ తరువాయి
వర్గాలు. గోరంట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మోడీ, చంద్రబాబు,పవన్,సవితమ్మ ల ఫోటోలకు పాలాభిషేకం చేసి గత ప్రభుత్వ హయాంలో బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను పెంచిందని తద్వారా బీసీలు రాజకీయంగా మరింత ఎదిగే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న రిజర్వేషన్ల ప్రకారం ఇదివరకు గోరంట్ల మండలంలో 6 మంది సర్పంచులు గెలిచారని పెరిగిన రిజర్వేషన్ల ప్రకారం మరో ఇద్దరు సర్పంచులు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్ ఆనంధం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, టిడిపి జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవి మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గిరిధర్ గౌడ్, అజంతుల్లా,జయరాం,నాగే నాయక్, మారెడ్డిపల్లి నరసింహులు, మల్లాపల్లి నరేష్ యాదవ్, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, చిలమత్తూరి వెంకటేష్,నబీ రసూల్, వృషభ దేవుడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రోహిత్, శ్రీశైలం శ్రీనివాసులు, మునిస్వామి, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, బిజెపి వెంకటచలం, కురుబ మల్లికార్జున, శంకర తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని, ఆ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్ మీట్ వీడియోను లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "ఏపీపీఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు. ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డీఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ)... ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

-మొదటిపేజీ తరువాయి
ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతపై బిగ్ అప్‌డేట్..

-మొదటిపేజీ తరువాయి
తర్వాత లబ్ధిదారుల జాబితా జిల్లా కలెక్టర్ల వద్దకు చేరుతుంది. కలెక్టర్లు దాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం స్థానిక ఇన్‌ఛార్జ్ మంత్రికి అందజేస్తారు. మంత్రి నుంచి ఆమోదం లభించిన తర్వాత అధికారులు లబ్ధిదారుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. మొత్తంగా రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించిన ప్రభుత్వం, వీటి నిర్మాణం కోసం రూ.10,400 కోట్లను కేటాయించింది.

## శాంతి భద్రతలపై అవగాహన సదస్సు



**మడకశిర ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం** మండల పరిధిలోని గౌడనహళ్ళి గ్రామ పంచాయితీ లో నూతన ఇంచార్జ్ కానిస్టేబుల్ జమ్మానిపల్లి గ్రామం లో గురువారం పర్యటించి శాంతి భద్రతల పై అవగాన కల్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం గౌడనహళ్ళి పంచాయతీ పరిధిలో ని జమ్మాని పల్లి తురకవాండ్ల పల్లి గౌడనహళ్ళి గ్రామాల కు సంబంధించిన నూతన ఇంచార్జ్ కానిస్టేబుల్ చిన్నకేశవులు, సహచర పోలీసు సిబ్బంది రమేష్ నాయక్, లు జమ్మానిపల్లి గ్రామం లో పర్యటించి గ్రామస్తులని కలిసి నూతన ఇంచార్జ్ గా వచ్చానని గ్రామస్తులతో సుపరిచయం చేసుకుని శాంతి భద్రత ల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో క్లస్టర్ కన్వీనర్ మురళి బాబు బూత్ ఇంచార్జ్ శివప్ప, గ్రామస్తులు నాగప్ప , అంజినప్ప, శంకర్ రెడ్డి , మారుతీ , పెదయ్య ,,రామాంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రేపు వరలక్ష్మి వ్రతానికి సాధారణ సెలవు

**మిలాద్-ఉన్-నబీ సెలవు 26కి మార్పు**

**స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించిన ఏపీ ప్రభుత్వం**

**తాడిపత్రి, ఆగస్టు 20 - సీమావార్త సాయంత్రం:** వరలక్ష్మి వ్రతం సందర్భంగా రేపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించింది. ఈ మేరకు రేపు అంటే ఆగస్టు 21 శుక్రవారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్కూళ్లు, బ్యాంకులకు సెలవు ఉంటుంది.
ఇదే సమయంలో మిలాద్-ఉన్-నబీ సెలవును కూడా ప్రభుత్వం మార్పు చేసింది.
గతంలో ఏపీ ప్రభుత్వం 25-08-2026 మంగళవారం మిలాద్-ఉన్-నబీ సెలవుగా ప్రకటించింది. అయితే రబీ ఉల్ అవ్వల్ నెల వంక 12-08-2026న కనిపించకపోవడంతో 12వ రబీ ఉల్ అవ్వల్ అంటే మిలాద్-ఉన్-నబీ 26-08-2026 బుధవారం వస్తుందని ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.
దీన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నేడు +ా ఞ చీశీ.1674 ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 26-08-2026 బుధవారం మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సాధారణ సెలవు దినంగా ప్రకటించింది.
సెలవు వివరాలు:
- 21-08-2026 శుక్రవారం: వరలక్ష్మి వ్రతం సెలవు
- 22-08-2026 శనివారం ః 23-08-2026 ఆదివారం: వారాంతపు సెలవు
- 25-08-2026 మంగళవారం: మిలాద్-ఉన్-నబీ సెలవు రద్దు
- 26-08-2026 బుధవారం: మిలాద్-ఉన్-నబీ సెలవుగా కొత్త ప్రకటన

సాధారణ సెలవు కాబట్టి అన్ని ప్రభుత్వ, అర్ధ ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఉంటుంది. దీంతో ఈ వారంలో ఉద్యోగులు, విద్యార్థులకు 21, 22, 23 మరియు 26 తేదీల్లో వరుసగా సెలవులు వచ్చినట్లైంది.

## అసెంబ్లీలో మార్మోగిన "సూపర్ సిక్స్" హామీల అమలు -- ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అద్భుత ప్రసంగం!




**మడకశిర ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు ఎన్నికల హామీల అమలుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు చేసిన ప్రసంగం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునేలా ప్రభుత్వం చేపడుతున్న చారిత్రాత్మక చర్యలను ఆయన సభలో సవివరంగా వివరించారు.

**ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**
ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం 'సూపర్ సిక్స్': ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని క్రమపద్ధతిలో, బాధ్యతాయుతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎం.ఎస్.రాజు స్పష్టం చేశారు.
సమగ్ర సంక్షేమం: సమాజంలోని అన్ని వర్గాలకూ (రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు) మేలు చేసేలా రూపొందించిన ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా చేరుతోందని పేర్కొన్నారు.
ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి హామీని అమలు చేసి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
అభివృద్ధి - సంక్షేమం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని గణాంకాలతో సహా సభలో వివరించారు
శాసనసభ వేదికగా ఎం.ఎస్.రాజు గారు మాట్లాడిన ఈ మాటలు ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై మరింత భరోసాని నింపేలా ఉన్నాయి. ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిజమైన నిబద్ధతను ఈ ప్రసంగం మరోసారి స్పష్టం చేసింది.

## బీసీ రక్షణ చట్టం కూటమితోనే సాధ్యమైంది.

**....రాయలసీమ బీసీ నాయకులు హర్షం.**



**పుట్టపర్తి ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం**
బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34% రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు పుట్టపర్తిలో బీసీలు వర్గాలు వ్యక్తం చేయడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రిజర్వేషన్ 23% కు తగ్గించడంతో, కూటమి ప్రభుత్వం 34% రిజర్వేషన్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించింది. బీసీలకు రాజ్యాధికారాన్ని, అదే విధంగా బీసీలు అంటే బ్యాక్ బోన్ అనే విధంగా, బీసీలకు తగిన గౌరవనీస్తూ, త్వరలో బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. శ్రీ నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు , యువగళం పాదయాత్ర ద్వారా బీసీ రక్షణ చట్టం తెస్తామన్నారు, తప్పకుండా త్వరలో బీసీ రక్షణ చట్టం తెచ్చి, బీసీల ఆత్మగౌరవాన్ని పెంచే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని మరోసారి రుజువయింది. చంద్రబాబు నాయుడు కి, యువ నాయకుడు నారా లోకేష్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన రాష్ట్ర పలు బీసీ సంఘాల నాయకులు, రాష్ట్ర రాయలసీమ బీసీ సంఘం అధ్యక్షులు కోటల శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ. తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

గురువారం
20 ఆగస్టు 2026

## నేతన్న ఫ్యామిలీ పై... కనికరం చూపిన ఖద్దర్ నేత.

వింత వ్యాధితో బాధపడుతున్న చంద్రకళకు నిమ్మల శ్రీధర్ అండ.

ౖా4 లో భాగంగా ప్రతినెల రూ, 5 వేలు పెన్షన్ తరహా సొంత సొమ్ము సాయం.

పంచాయతీ జనం పై ప్రేమ చూపుతున్న ఆదర్శ వ్యక్తి నిమ్మల శ్రీధర్.

మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా రూ, 5 వేల ఆర్థిక సాయం.





**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.** పేద కుటుంబంలో పుట్టి చేనేత వృత్తి ద్వారా జీవనం సాగించుకుంటున్న ఆ కుటుంబంలో చంద్రకళకు వింత వ్యాధి సోకి చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం ఆ నేత చెవిన పడిన వెంటనే గుమ్మయ్య గారి పల్లి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు నిమ్మల శ్రీధర్.

ఈ సందర్భంగా గుమ్మ గారి పల్లి గ్రామానికి చెందిన చేనేత కుటుంబీకులు మంగమ్మ కుమార్తె చంద్రకళకు దీర్ఘకాలిక వ్యాధితో కూడిన పెన్షన్ మంజూరయ్యే వరకు పి 4 లో భాగంగా దత్తత తీసుకొని ప్రతినెల బాధితురాలు చంద్రకళకు రూ, 5 వేలు పెన్షన్ తరహా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా గురువారం ఐదువేల నగదును బాధితురాలికి మండల కన్వీనం బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా అందజేశారు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో పేద ప్రజలకు సహాయం అందిస్తూ విద్య వైద్య పరంగా పేదలకు సాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు నిమ్మల శ్రీధర్. ఈ కార్యక్రమం లొ గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ కూరబ మహేంద్ర, శ్రీకాంత్ యాదవ్,క్లస్టర్ ఇంచార్జ్ రోహిత్, శ్రీశైలం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం



**మడకశిర ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పేరిట డోర్ టు డోర్ కార్యక్రమం గురువారం నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం దేవర హొట్టి గ్రామపంచాయతీ లోని 73 బూత్. హెచ్ ఆర్ హొట్టి గ్రామం లో ఇంటింటికి తిరుగుతూ మీకు ఇచ్చిన అభివృద్ధి పత్రం ప్రజలకు వివరిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్ ఆర్ హొట్టి శ్రీనివాస్ చంద్రప్ప భోజరాజ్ ,రంగప్ప, ప్రవీణ్ ,నగేష్, తిప్పేస్వామి, చంద్ర, అరుణ్ ,నందీష్, నగేష్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్ ఉమేష్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## మడకశిర నియోజకవర్గం లో ఓల్టేజీ సమస్యలను పరిష్కరించండి

మంత్రి గొట్టిపాటికి ఎం.ఎస్.రాజు వినతి



**మడకశిర ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం** నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి ని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రిని వారి కార్యాలయంలో ఎం.ఎస్.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిర నియోజకవర్గంలో నెలకొన్ని లో ఓల్టేజీ సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన మేరకు నిధులు విడుదల చేయాలని మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించేందుకు ఎం.ఎస్.రాజు గారు అలుపెరుగని శ్రామికుడిలా పనిచేస్తున్నారు.

## మా తల్లి ఆశీస్సు లతో అన్నదానం
## గర్భిణీ స్త్రీల ఆకలి తీర్చండశీ నా పూర్వ జన్మ పుణ్యం

-------- రామానందన్




**లేపాక్షి ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి వారం జరిగే పరీక్షలకు విచ్చేసిన గర్భిణీ మహిళలకు రమా మణి జ్ఞాపకార్థం వారి పేరిట ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, కరణం రమానం దన్ శుక్రవారం దాదాపు 41మంది మహిళలకు ఉచితశీగా పౌష్టి కాహారం అందజేసే కార్యక్రమం ప్రతి వారం లాగే యథా విధిగా నిర్వహిం చడం జరిగింది. కరణం రమానందన్ వారి తల్లి పేరు మీద మాతృమూర్ధులకు(గర్భిణి లకు ) భోజనం ఉచితంగా అందజేయడం నా అదృష్టం అని అయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, రమానందన్ మిత్రమండలి పాల్గొన్నారు.

## కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి

------ హిందూపురం

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్

------ హిందూపురం న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరు.. ర్యాలీ




**లేపాక్షి ఆగస్టు 20 సీమ వార్త సాయంకాలం :** దశాబ్దాలుగా రాయ లసీమ ప్రజలు కలగంటున్న రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఇప్పటికీ నెరవేర లేదు. రాయలసీమ నుంచే ముఖ్య మంత్రులుఅధికారంలోకి వచ్చినప్పటికీ, ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత మరుగున పడుతు న్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలోనూ, ఎన్నికల ప్రచార సభ లలోనూ కర్నూలు లో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళు పూర్తయినా ఆ హామీ అమలు కాలేదు. ఇంతకు ముందు కూడా రాయలసీమ న్యాయవాదులు అనేకసార్లు కోర్టు బహిష్కరణలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, ప్రతి ప్రభుత్వం "త్వరలో", "పరిశీలి స్తున్నాం" అనే మాటలతో కాలయా పన చేస్తూ వచ్చింది. కాబట్టి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీని నిలబెట్టు కుంటూ కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరై ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి కృష్ణ మూర్తి, న్యాయవాదులు ఇందాద్, శ్రీనివాసరెడ్డి, నాగరాజ్ రెడ్డి, సిద్ధ గంగప్ప, నాగప్ప, రాజశేఖర్, ,కళావతి ,గోపాల్ ఆసిఫ్, మురళి ,యూసుఫ్ కదరిష్ వినోద్, మనోజ్ ,వర్ష రెడ్డి, ముజీబ్,చెన్నప్ప, ఉల్కలప్ప, అజేయ్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. రాయల సీమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నీటి నిల్వల వల్లే దోమల ఉత్పత్తి.

**....ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా....బూదిలి,పులేరులో అవగాహన ర్యాలీ.**





**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 20న బూదిలి, పులేరు గ్రామాలలో ఆరోగ్య శాఖ,మలేరియా విభాగం హిందూపురం బృందం సంయుక్తంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పాఠశాల నుండి ర్యాలీ ప్రారంభమైంది. ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు, స్కూల్ విద్యార్థులు గ్రామ ప్రజలు "నిల్వ నీటిని కదిలిద్దాం, దోమలను అంతమొందిద్దాం" అంటూ నినాదాలు చేశారు. గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వస్తుందని కనుగొన్నారని తెలిపారు. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా కేసులు పెరుగుతాయని చెప్పారు. ఇంట్లో, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి బుధవారం డ్రై డే " పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ సాయి సుప్రిత, మలేరియా విభాగం అధికారి శివన్న గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు రంగనాధ్, శ్రీకాంత్, చెన్నారెడ్డి, చిన్నకేశవరెడ్డి, సరస్వతి, పార్వతి, జానకి, ఆశా కార్యకర్తలు మరియు సచివాలయం సిబ్బంది టీచర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అటవీ ప్రాంత పల్లె లో...
## " పచ్చ"ని LED కాంతులు.

.....కమ్మలవాండ్లపల్లిలో వెలిగిన వీధి దీపాలులి

మంత్రి సవితమ్మ చొరవ తో... గ్రామ సమస్యలు పరిష్కరించిన ఉత్తమ రెడ్డి, వడ్డే నాగేంద్ర..

హర్షం వ్యక్తం చేసిన కమ్మల వాండ్ల పల్లి గ్రామస్తులు.





**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.** గ్రామంలో ప్రధాన సమస్యల్లో ఒకటైన వీధిలైట్ల కొరతకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి యువ నాయకులు వడ్డే నాగేంద్ర సమస్యను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి గ్రామంలోని ప్రధాన వీధులు, సందులు, పరిసరాల్లో నూతన ఎల్ ఈ డీ వీధిలైట్లను ఏర్పాటు చేయించి ప్రజల మన్ననలు పొందారు. గత కొంతకాలంగా గ్రామంలో వీధిలైట్లు లేకపోవడం లేదా ఉన్నవి వెలగకపోవడం వల్ల రాత్రి 7 గంటల తర్వాత ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చీకటి కారణంగా పాములు, తేళ్ల భయం ఉందని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి మరియు వడ్డే నాగేంద్ర వెంటనే స్పందించారు. గ్రామస్తులతో మాట్లాడి, ఎక్కడెక్కడ లైట్లు అవసరమో స్వయంగా పరిశీలించారు. పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకొని గ్రామంలో అన్నిచోట్ల వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. లైట్లు వెలిగిన వెంటనే గ్రామం మొత్తం కొత్త వెలుగుతో నిండిపోయింది. గ్రామం బాగుంటేనే మనం బాగుంటాం అనే చిన్న ఆలోచనతోనే ఈ పని చేశాము. ఇది మా బాధ్యతగా భావిస్తున్నాము. ఇది కేవలం లైట్ల సమస్య కాదు, ప్రజల భద్రతకు సంబంధించిన విషయం" అని ఈ సందర్భంగా ఉత్తమ్ రెడ్డి మరియు వడ్డే నాగేంద్ర అన్నారు. వీధిలైట్లు వెలగడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఉత్తమ రెడ్డి మరియు వడ్డే నాగేంద్ర మా సమస్యను అర్థం చేసుకుని వెలుగు నింపారు. వారికి గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు" అని గ్రామ పెద్దలు మరియు మహిళలు తెలిపారు.

## ఇంటింటికి ఇచ్చాం సంక్షేమం....
## అందుకే మీ ఇంటికి వచ్చాం.

....రెండేళ్ల నమ్మకం... ప్రతి ఇంటి అభివృద్ధికి అంకితం!"



**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే "ఇంటి-ఇంటికీ తెలుగుదేశం" కార్యక్రమం కు శ్రీకారం చుట్టారు, గోరంట్లమండలం పాలసముద్రం గ్రామ పంచాయతీలో రాగిమేకుల పల్లి లో నిర్వహించారు. బూత్ నెంబర్ 196 లో కుటుంబాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి, మై టిడిపి యాప్ ద్వారా వివరాలను నమోదుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మనోహర్,బూత్ కన్వీనర్ అంజి,కాటేపల్లి అంజి,నాగరాజు, ఆనంద్,బాలరాజు,శ్రీరాములు,నరసింహులు, మునెప్ప, కదిరన్న గారీ నరసింహ,కొత్తూరు మూర్తి మాజీ వార్డు మెంబర్ నరసింహ, సాదిలీ అశ్వర్థప్ప,గ్రామస్తులు పాల్గొన్నారు.

## శీనప్పల్లి కి నీటి సమస్య పరిష్కారం.

**గ్రామంలోని ఐదు బోర్లకు మరమ్మతులు చేసిన .... పార్టీ నాయకులు అధికారులు.**



**గోరంట్ల ఆగస్టు 20 సీమ వార్త సాయంత్రం.** మండలంలోని గౌని వారి పల్లి పంచాయతీ పరిధిలోని సీనప్పల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం స్థానిక పార్టీ నాయకులు అధికారులు కలిసి చర్యలు తీసుకుని నీటి సమస్య పరిష్కారం ఏవిధంగా మరమ్మతు కార్యక్రమాలు చేపట్టారు. మండల ఎంపీడీవో కమలాబాయ్, ప్రత్యేక అధికారి జాన్ రెడ్డప్ప, మరియు స్థానిక కూటమి ప్రభుత్వం నాయకులు వై రవి మోహన్ సహకారంతో గౌని వారి పల్లి గ్రామ పంచాయతీ శీనపల్లి గ్రామం నందు రామయ్య ఇంటి దగ్గర ఉండే బోరులో 5 పైపులు, స్కూల్ దగ్గర ఉండే బోరులో 5 పైపులు మరియు చెరువులో ఉండే బోరులో ఐదు పైపులు బోరులో నీళ్లు తగ్గినందువలన కొత్తగా ఒక్కొక్క బోరులో 5 పైపులు కేబుల్ వైరు ఏర్పాటు చేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881